రైతులకు పట్టా పాస్‌బుక్స్ ఇప్పిస్తా !





పెద్దగోల్కొండ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ప్రచారంలో భాగంగా దోశలు వేస్తున్న సంతోష్‌గౌడ్

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: తనను మరోసారి గెలిపిస్తే బహదూర్‌గూడ రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇప్పిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ గ్రామాల్లో రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 15 ఏళ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. రాజకీయ నేతల తప్పుడు మాటలు విని మోసపోవద్దని, బీఆర్‌ఎస్ పార్టీ విజయం ఖాయమన్నారు. ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆగ్రహం..

రషీద్‌గూడలో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతుండగా.. స్థానిక యువకుడు పలు సమస్యలపై గళం ఎత్తాడు. డబుల్‌బెడ్రూం, రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారంటూ అడగడంతో సహనం కోల్పోయిన ప్రకాష్‌గౌడ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. సదరు యువకుడికి బీఆర్‌ఎస్ నాయకులు సర్దిచెప్పారు.

అత్తాపూర్ డివిజన్‌లో..

అత్తాపూర్: ఇంటింటి ప్రచారంలో భాగంగా రాంబాగ్, వీకర్ సెక్షన్స్ కాలనీ, మల్లయ్య టవర్స్, తేజస్వినీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కారు గుర్తుకు ఓటు వేయాలని చెబుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. తొలికంటి సంతోష్‌గౌడ్, డివిజన్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి, అమరేందర్, సురేష్‌రెడ్డి, మిద్దెల రాజురెడ్డి, సోనూ అగర్వాల్, సత్తిరెడ్డి, కామసాని మహేందర్‌రెడ్డి, కావలి శేఖర్, అర్జున్‌రెడ్డి తదితరులున్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం కావాలో... శాస్త్రిపురం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌ను మజ్లిస్, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి కుట్రపూరితంగా శాస్త్రిపురం నియోజకవర్గంగా మార్చేందుకు పన్నాగం పన్నాయని ఆయన ఆరోపించారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దఫాలుగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రాజేంద్రనగర్ డివిజన్‌లో చేసిన అభివృద్ధి ఏమి లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్, మజ్లిస్‌లు అవగాహన ఒప్పందంలో భాగంగా వచ్చే పునర్విభజనలో రాజేంద్రనగర్‌ను శాస్త్రీపురం నియోజకవర్గంగా మార్చేందుకు నిర్ణయించాయన్నారు. ప్రజలు ఈ కుట్రను తిప్పి కొట్టాల్సిన అవసరముందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటువేస్తే అది మజ్లిస్‌కు చెందుతుందన్నారు. బీజేపీకి ఓటువేసి గెలిపించాలని, రాజేంద్రనగర్‌ను కాపాడుతామన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న ప్రకాష్‌గౌడ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. శివరాంపల్లి ప్రాంతంలో ఏమి అభివృద్ధి చేశాడో తనతో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి



తోకలను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

బండ్లగూడ: ప్రజా సంక్షేమం కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రజలు తమ మధ్య ఉండి తమ బాగోగులు చూసుకునే ఎమ్మెల్యేను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఓటర్లంతా కారు గుర్తుకు ఓటు వేసి తమ మద్దతు తెలపాలన్నారు. కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌గౌడ్‌కు మద్దతుగా..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పాల్గొని ప్రచారం నిర్వహిస్తూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు మేనిఫెస్టోలో పొందుపరిచిన అన్ని పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ఓట్లు అభ్యర్థించారు. సీనియర్ నాయకులు ముర్తుజా అలీ, చలసాని విష్ణుమూర్తి, యాదమ్మ, సుజాత, సుమలత, జబీన్ హుస్సేన్, అండాలు, సుల్తానా, రాపోలు సత్తయ్య, సామ ఇంద్రపాల్‌రెడ్డి, ఉమ్మారెడ్డి, పుంజాల సాయిగౌడ్, రఘుగౌడ్, రఘు, వినాయక, ప్రీతమ్‌రాజ్, రజనీకాంత్, వీర్లపల్లి మహేష్, అక్కిరాజు సుబ్బారావు, వీర్లపల్లి నవీన్ తదితరులున్నారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ.. శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని యాదవబస్తీలోని ఓ హోటల్‌లో బజ్జీలు వేస్తూ.. కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఝాన్సీరాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ మాజీ వార్డు సభ్యురాలు ఝాన్సీరాణి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ సమక్షంలో ఆమె రాజేంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. ఝాన్సీరాణితో పాటు మహిళా నాయకురాళ్లకు కండువాలు వేసి పార్టీలోకి కస్తూరి నరేందర్ ఆహ్వానించారు. అనంతరం స్థానికంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు కే.ఎస్.దయానంద్, కోరని బాల్‌రాజ్, కోరని నరేందర్, స్వర్ణలత తదితరులున్నారు.

జోరుగా బీజేపీ ప్రచారం

మణికొండ: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు బిక్షపతియాదవ్‌ల ఆధ్వర్యంలో ప్రచారాలను ముమ్మరంగా ప్రతిరోజు నిర్వహిస్తున్నారు. శనివారం పలుకాలనీలలో నిర్వహించిన ప్రచారంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్, 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన చూశారని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు.

అహంకారంపై విజయం తథ్యం

అత్తాపూర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు అహంకారం ఆత్మ విశ్వాసానికి మధ్య జరుగుతున్నాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు మామిడి సుధాకర్ పేర్కొన్నారు. ఇవి యుద్ధంలాంటి ఎన్నికలని, దీనిలో బీజేపీ ఆత్మ విశ్వాసం, విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి తరఫున శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనకు అనుకూలంగా ప్రజలు స్పందిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ గద్దె దిగడం ఖాయమని, అధికార పార్టీ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, ఎం.విజయ్‌స్వామి, కొండకళ్ల కార్తీక్‌రెడ్డి, ఎస్.జిత్తుసింగ్, ఎం.సందీప్‌రెడ్డి, మిద్దెల రాజశేఖర్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, కె.అభిలాష్‌రెడ్డి, శ్రీను, రమేష్, శివ, హేమంత్, రాముగౌడ్, ఓంకార్ తదితరులున్నారు.

జపాన్‌లో ఉన్నత విద్యావకాశాలు

గచ్చిబౌలి: జపాన్‌లోనూ విద్యావకాశాలు పుష్కలంగా ఉన్నాయని కాన్సుల్ జనరల్ ఆఫ్ జపాన్(చెన్నై) హెటాగా మసయూకీ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని ఏషియన్ సన్‌సిటీలో నాగ రామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జపనీస్ ఫెస్టివల్‌లో నా.రా జపాన్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జపాన్ హబ్‌తో భారత్, జపాన్ మధ్య మైత్రి బలోపేతమవుతుందన్నారు. జపాన్ కల్చర్, ఎడ్యుకేషన్, టూరిజం తదితర అవకాశాలను తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. నాగ రామ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు నాగనాథ్ మాట్లాడుతూ 20 ఏళ్ల పాటు జపాన్‌లో ఉన్న అనుభవంతో నా.రా జపాన్ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కల్చర్ ఎక్స్ఛేంజ్‌తో పాటు జపనీస్ భాష నేర్పుతామని తెలిపారు. జపాన్‌కు వెళ్లాలనుకునే విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, విద్యావకాశాల గురించి తెలియజేస్తామన్నారు. జపనీస్ ఫెస్టివల్‌లో మూడు రోజుల పాటు జపనీస్ డాల్స్, బొన్సాయ్ మొక్కల ప్రదర్శన ఉంటుందన్నారు. జపాన్ ఫౌండేషన్ (న్యూఢిల్లీ) డైరెక్టర్ జనరల్ సటు కోజీ, నాగ రామ ట్రస్ట్ ప్రెసిడెంట్ రామభద్ర పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

బండ్లగూడ: ప్రజలందరికీ ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్(వీఐఎస్)లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పకుండా ఉపయోగించుకోవాలని, తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు కల్పిస్తుందన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా పాల్గొని తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ ఆఫీసర్లు, సెక్టారల్ ఆఫీసర్లు తదితరులున్నారు.



స్లిప్పులను అందజేస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

పరిశోధన నిరంతర ప్రక్రియ

మణికొండ: పరిశోధన నిరంతర ప్రక్రియ అని, దీనితో పాటు బోధన సమాజానికి ఎంతో అవసరమని, అవి సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని జేఎన్‌టీయూ మాజీ వైస్ ఛాన్సలర్ డీఎన్‌రెడ్డి అన్నారు. సీబీఐటీ కళాశాలలో శనివారం జరిగిన పంచమ పరిశోధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశోధనలు జరిగి వాటి ఫలితాల్లోనే సమాజం ఉన్నత స్థానాలతో పాటు తమ ఆలోచనా సరళిని మార్చుకుంటుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ ఎస్. దివాకర్‌లు మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్‌లాంటివి 30 ఏళ్ల క్రితం లేవన్నారు. ప్రపంచం మొత్తం అనేక మంది పరిశోధకులు సృష్టించిన సాధనాల గురించి మనకు ఉన్న జ్ఞానం నిరంతరం మారుతూ ఉంటుందన్నారు. మన విద్యతో పాటు కొత్త జ్ఞానాన్ని సృష్టించుకోవటంలో మనం ముందుండాలన్నారు. సీబీఐటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. పరిశోధన ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతుందన్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు రీసెర్చ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెడుతున్నాయన్నారు. ఈ తరం విద్యార్థులు వారి ఆలోచనలను ప్రదర్శించడానికి, నేర్చుకోవటానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం పలు విభాగాలు పోస్టర్, రీసెర్చ్ పేపర్ ప్రెజెంటేషన్‌లు నిర్వహించాయి. ఆర్,ఈహబ్ విభాగాధిపతి, ఇన్‌చార్జి డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ఆర్,డీ. సలహాదారుడు ఏడీ శర్మ, కన్వీనర్లు డాక్టర్ సుధాకర్‌బాబు, సరిత, వినోద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. చిన్నారులు, మూగజీవాలు సైతం ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఎటు చూసినా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు కనిపిస్తున్నాయి. విద్యుత్ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బాలుడు తీవ్ర గాయాలపాలైన ఘటన టీఎన్జీఓస్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీఓస్ కాలనీలో నివసించే రోషన్‌కుమార్, ప్రియాంకదేవీలు దంపతులకు క్రిష్ణకుమార్ (4) సంతానం. రెండు నెలల క్రితం బిహార్ నుండి బతుకుదెరువు కోసం కాటేదాన్ ప్రాంతానికి వలస వచ్చారు. తండ్రి ఓ ఫుడ్స్ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. బాలుడు తోటి మిత్రులతో బయటికెళ్లి ఆడుకునే క్రమంలో ముగ్గురు ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కడానికి యత్నించారు. అందులో క్రిష్ణకుమార్ అనే బాలుడు పైకి ఎక్కి వైర్లను తాకాడు. దీంతో బాలుడికి షాక్ తగలడంతో భారీ శబ్దంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు ఎగిరిపోయింది. శబ్దం రావడంతో ఇద్దరు చిన్నారులు పరిగెత్తారు. బాలుడు గాయాలతో కిందపడగానే స్థానికులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడు గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. పేదవారు కావడంతో స్థానికులు చికిత్స కోసం కాలనీవాసులు చందాలు వేసుకుని బాలుడికి మెరుగైన చికిత్స చేయిస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు

బడంగ్‌పేట్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ శ్రీవంశీధర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 3 బంగారు, 2 రజిత, 18 కాంస్య పతకాలు సాధించడంతో పాటు చాంపియన్‌షిప్ కప్‌ను సైతం కైవసం చేసుకున్నారు. కాంటినెంటల్‌సాత్‌ఖాన్ కరాటేడో ఇండియా ఆధ్వ ర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు, 50 పాఠశాలల నుంచి తలపడ్డాయి. ఈ సందర్భంగా పాఠశా ల చైర్మన్ కె.కృష్ణారెడ్డి విద్యార్థులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో డీన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలల పండుగ

మాదాపూర్: శిల్పారామంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాలల పండుగలో భాగంగా శనివారం డ్యాన్స్, మ్యూజిక్, పెయింటింగ్ ఏర్పాటు చేశారు. దాదాపు 126 మంది కళాకారులు ప్రతిభ చాటారు. శిరీష దేవులపల్లి శిష్యబృందం కర్ణాటక గాత్ర కచేరి, సుష్మిత శర్మ శిష్యబృందంచే ఒడిసి నృత్యం, ప్రియ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన, సాత్విక శిష్యబృందంచే కూచిపూడి, డాక్టర్ చంద్ర తప్ప సహరాయ్ శిష్యబృందం కథక్ నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ఏజీవర్సిటీ: ప్లాంట్ ప్రొడెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నాల్గు రోజులుగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న మొక్కల ఆరోగ్య ఆవిష్కరణ, సుస్థిరతపై జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని సుస్థిర వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

బడంగ్‌పేట్: రంగారెడ్డి జిల్లా 67వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో బడంగ్‌పేటలోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. చదరంగంలో భాగ్యశ్రీ బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయింది. స్కేటింగ్ విభాగంలో పి.వర్షిత ఐదు వందలు, వేయి మీటర్ల విభాగంలో కాంస్యం సాధించింది. పి.వరుణ్ స్కేటింగ్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుప్రభ హనీ, శిక్షకులు నోమన్‌అలీ, హఫీస్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశభక్తి అలవర్చుకోవాలి

మొయినాబాద్: ప్రతిఒక్కరూ దేశ భక్తి అలవర్చుకోవాలని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు పేర్కొన్నారు. మొయినాబాద్ సిద్ధార్థ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు.

పటిష్ట బందోబస్తు

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

శంషాబాద్: వచ్చే 12 రోజులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. నోడల్ అధికారులైన డీసీపీ, ఏసీపీలతో శనివారం శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు ప్రణాళికా బద్ధంగా శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. అక్రమ మద్యం, నగదు పంపిణీల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు రూట్ మొబైలింగ్‌ను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్దకు రవాణా సాఫీగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శంషాబాద్ డీసీపీ కె. నారాయణరెడ్డి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు, ఎలక్షన్ సెల్ డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీలు రవికుమార్, రామ్‌కుమార్, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

‘మేనేజ్’కు గోల్డ్ స్కాచ్ అవార్డు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియాలో జరిగిన 95 స్కాచ్ సమ్మిట్‌లో ప్రతిష్ఠాత్మకమైన గోల్డ్ స్కాచ్ ఆఫ్ అగ్రి-క్లినిక్, అగ్రి బిజినెస్ అవార్డును న్యూఢిల్లీలో మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చంద్రశేఖర్ అవార్డును అందుకున్నారు. మేనేజ్‌లో ఇప్పటి వరకు 87000 వేల మందికి పైగా వ్యవసాయం, సైన్స్ గ్రాడ్యుయేట్‌లను అగ్రిప్రెన్యూర్‌లుగా మార్చడం, 38000 నిరుద్యోగులు యువతకు వ్యవసాయంలో శిక్షణను ఇచ్చినందుకు దేశంలోని ప్రజల సామాజిక ఆర్థిక అభివృద్ధికి విశేష కృషి చేసినందుకు కేంద్రప్రభుత్వం ఈ అవార్డును అందించింది.



అవార్డును అందుకుంటున్న అధికారులు

అగ్ని ప్రమాద ఘటనలో అపార్ట్‌మెంట్ యజమాని అరెస్ట్

నాంపల్లి: ఇటీవల బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనలో పది మంది మృతి చెందిన సంగతితెలిసిందే. ఈ ఘటనలో బాలాజీ అపార్ట్‌మెంట్ యజమాని రమేష్‌కుమార్ జైస్వాల్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన మేరకు.. బజార్‌ఘాట్‌లోని బాలాజీ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 13న ఉదయం 9 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అక్రమంగా ప్రమాదకరమైన కెమికల్స్‌ను నిల్వఉంచారు. భారీగా నిల్వ చేసిన కెమికల్ డ్రమ్ములకు మంటలు అంటుకుని 9 మంది సజీవ దహనమయ్యారు. అలాగే ఒకరు తీవ్ర గాయాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదం సంభవించిన సమయంలో భవన యజమాని రమేష్‌కుమార్ జైస్వాల్ అక్కడే ఉన్నారు. మంటలను ఆర్పే ప్రయత్నంలో కెమికల్ నుంచి వచ్చిన విషపూరితమైన వాయువులను పీల్చుకుని అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన అతడిని అంబులెన్స్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అస్వస్థత నుండి కోలుకున్న రమేష్‌కుమార్ జైస్వాల్‌ను శనివారం లక్డీకాపూల్‌లోని ఆసుపత్రికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ప్రమాదం జరిగిన రోజే అతడిపై కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన అతడిని రిమాండ్‌కు తరలించారు.

గోషామహాల్ చాక్నావాడిలో అగ్నిప్రమాదం



నర్సింగ్‌రావును ప్రశంసించిన నగర పోలీస్ కమీషనర్ సందీప్ శ్యాండిల్య

అబిడ్స్: గోషామహాల్ చాక్నావాడిలో అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం తెల్లవారుజామున ఉడ్ బీడింగ్ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.....తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో ఉడ్ బీడింగ్ దకాణంలో మంటలు చెలరేగడంతో స్థానిక షాపు యజమాని ఫిరోజ్ వెంటనే అక్కడికి చేరుకొని పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పివేశారు. పక్కనే ఉన్న కలప డిపోలకు మంటలు వ్యాపించి భారీ నష్టం జరిగి ఉండేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటన సమయంలో విజయ డేయిరి ఫారంకు చెందిన నర్సింగ్‌రావు అనే వ్యక్తి అప్రమత్తం కావడం వల్ల భారీ ప్రమాదం తప్పిందని తెలిపారు. బాధ్యతగల పౌరుడుగా నర్సింగ్‌రావు చేసిన కృషిని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శ్యాండిల, డీసీపీ కవిత, ఏసీపీ, సీఐ తదితరులు అభినందించారు. నర్సింగ్‌రావు ఉత్తమ పౌరుడిగా పనిచేశారని ప్రశంసించారు.



అగ్నిప్రమాదం దృశ్యం

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛభారత్ అభియాన్



స్వచ్ఛ భారత్ అభియాన్‌లో డాక్టర్ మజహర్‌ఉల్లా తదితరులు

గోల్కొండ: ఆసుపత్రి సిబ్బందితో పాటు ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు స్వచ్ఛమైన గాలిని అందించడానికి నిరంతరం తాము కృషి చేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా అన్నారు. శనివారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ఏఏవో, ఇన్‌చార్జి ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాస్‌రావు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన డీసీపీ

గోల్కొండ: సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటైన పోలింగ్ స్టేషన్‌లను వాటి పరిసరాలను ఆయన పరిశీలించారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

గోల్కొండ: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటింగ్ జరిగే రోజు ఓటు వేయాలని మజ్లిస్ సీనియర్ నాయకులు ఆలీముద్దీన్ అన్నారు. శనివారం ఆయన ఓటు హక్కు వినియోగించడంపై జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా భారతీయులందరు ఓటు హక్కును పొందారని ఆయన అన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

నాంపల్లి: రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందారు. ఈ సంఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి బోరబండ-హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన విజయపురి ప్యాసింజరు రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపైన నలుపు, నీలం రంగు గళ్ల చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు.